

మద్దిలేటయ్యలో భక్తుల రద్దీ

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారికి వివిధ సేవలు నిర్వహించడంతో రూ.7,58,605 ఆదాయం వచ్చింది.



శ్రీమఠంలో సినీ నటుడు సుదీప్

మంత్రాలయం: కన్నడ సినీ నటుడు సుదీప్ శనివారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్న అనంతరం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శాంకరీ నాట్యశాల వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష



కర్నూలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ శనివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పరీక్షకు జిల్లాలో మొత్తం 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 7,254 మంది విద్యార్థులకుగాను 6,373 మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలులో 8 కేంద్రాల్లో 4,239 మందికిగాను 3,702 మంది, ఆదోనిలో 10 కేంద్రాల్లో 3,015 మందికిగాను 2,671 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వైఎస్సార్ పెన్షన్ కానుకకు రూ.139.82 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): మే నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.139.82 కోట్లు విడుదలయ్యాయి. 4,68,742 పింఛనుదారులకు ఈ మొత్తం పంపిణీ చేయనున్నారు. ఈ నెల 30న బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి పెన్షన్ నిధులను డ్రా చేస్తారు. మే నెల 1 నుంచి పింఛన్లను పంపిణీ చేస్తారు. కర్నూలు జిల్లాలో 2,46,340 పింఛన్లకు రూ.73,74,49,500.. నంద్యాల జిల్లాలో 2,22,402 పింఛన్లకు రూ.66,08,47,000 పంపిణీ చేయనున్నారు. ఏప్రిల్ నెల తరహాలోనే మే నెలలో కూడా పంపిణీ చేసే అవకాశం ఉంది. అయితే స్పష్టత రావాల్సి ఉన్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు తెలిపారు.

బీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ శనివారం విలేకరులకు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 2,828 మందికిగాను 2,591 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 518 మందికిగాను 440 మంది ఉత్తీర్ణులు అయినట్లు పేర్కొన్నారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

పీటీజెడ్ కెమెరాలతో నిఘా



ఎఫ్ఎస్‌టీ వాహనంపై ఏర్పాటు చేసిన పీటీజెడ్ కెమెరా

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని జిల్లా స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలకు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 68 ఎఫ్ఎస్‌టీ వాహనాలకు అత్యాధునికమైన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ జి. సృజన తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలకు చెందిన వాహనాలకు పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఆయా వాహనాలు ప్రయాణిస్తున్న ప్రదేశాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. అలాగే ప్రత్యక్ష వీడియో కవరేజ్, డిస్ట్రిక్ట్ కంట్రోల్ రూమ్ నుంచి ఎఫ్ఎస్‌టీ బృందాల పనితీరు విధానాన్ని పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఈ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు.

ప్రతి రోజూ 1.15 లక్షల మందికి 'ఉపాధి'

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ప్రస్తుతం ప్రతి రోజూ 1.15 లక్షల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీవోలు,ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లతో శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నుంచి ఉపాధి పనులకు హాజరయ్యే వారి సంఖ్య 1.50 లక్షలకు పెంచాలని సూచించారు. గ్రామాల్లో ముందస్తుగా డిమాండ్ తీసుకొని పనులు కల్పించాలని తెలిపారు. ఎండలు, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటలకు పనులకు హాజరు కావాలని, 11 గంటలకు ఇళ్లకు చేరుకునే విధంగా చూడాలని ఆదేశించారు. పని ప్రదేశంలో వాటర్‌బెల్ పద్ధతిని పాటించాలన్నారు. అవసరమైతే సాయంత్రం 4 గంటల తర్వాత కూడా పనులు చేసుకోవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరును పోలిన వారితో నామినేషన్లు

- ప్రభావిత వర్గాలే లక్ష్యంగా ఆత్మీయ సమావేశాలంటూ విందులు
- అయినా ప్రచారంలో ఓటర్ల నుంచి చుక్కెదురు



టీ'ఛీ' కుట్రలు

కర్నూలు: ఎన్నికల కుతంత్రాలకు బీజేపీ నేత టీజీ వెంకటేష్ పెట్టింది పేరు. కర్నూలు శాసనసభ స్థానం నుంచి 20014లో టీజీ, 2019లో తనయుడు భరత్ ఓటమి చవి చూశారు. దీంతో ఈ ఎన్నికల్లో గెలవడానికి చేయని ప్రయత్నమంటూ లేదు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు, తిమ్మిని బమ్మిని చేసేందుకు తండ్రీ కొడుకులు కిందామీదా పడుతున్నారు. నామినేషన్ల పర్వంలో మరో ముందడుగు వేసి జిమ్మిక్కులకు తెర లేపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరును పోలిన వారితో నామినేషన్లను దాఖలు చేయించినట్లు చర్చ జరుగుతోంది. కర్నూలు గనిగల్లీ వీధికి చెందిన షేక్ ఇంతియాజ్ బాషా, గడ్డా వీధికి చెందిన షేక్ ఇంతియాజ్, ఖల్లా వీధికి చెందిన ఎండీ ఇంతియాజ్ బాషాలను వెతికిపట్టి మరీ నామినేషన్లు దాఖలు చేయించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. 2004 ఎన్నికల్లో సీపీఎం నాయకుడు గఫూర్‌తో పోటీ పడి ఓటమి పాలైనప్పుడు కూడా గఫూర్ పేరును పోలిన ముగ్గురితో నామినేషన్ వేయించి ఓటర్లను తికమక పెట్టించే జిమ్మిక్కులు ప్రదర్శించి ఓటమి పాలయ్యారు. రెండుసార్లు ఓటమి పాలు కావడంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా తన వారసుడిని గెలిపించుకునేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరును పోలిన వారితో నామినేషన్లు వేయించారనే వాదనకు బలం చేకూరుతోంది. వ్యక్తి పేరు ఒకే విధంగా ఉన్న వ్యక్తులను రంగంలోకి దింపితే పేర్లు చూసి ఓటర్లు తికమకపడి ఒకరికి బదులు మరొకరికి ఓటు వేస్తారని భావించి టీజీ ఇలాంటి అడ్డదారులు తొక్కుతారని ఆ పార్టీ నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ప్రభావిత వర్గాలే లక్ష్యంగా..

2019లో జరిగిన ఎన్నికల్లో టీజీ భరత్‌పై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హాఫీజ్ ఖాన్ 5,353 ఓట్లతో గెలుపొందారు. ఆ ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఓట్లు ఒడిసి పట్టేందుకు ప్రభావిత వర్గాలే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. పాతబస్తీలో నివాసముంటున్న టీజీ వెంకటేష్ సామాజిక వర్గానికి చెందిన వ్యాపారి ఇంటిని కేంద్రంగా చేసుకుని ఓటు బ్యాంకు కలిగిన సామాజిక వర్గాల నాయకులతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు. అలాగే ఉద్యోగులు, వ్యాపారులు, నిరుద్యోగులు, కులసంఘాల వారిని ప్రలోభ పెట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ ఆత్మీయ సమావేశాలంటూ కుల సంఘాల నాయకులు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖులను పిలిపించి విందులను ఏర్పాటు చేసి మచ్చిక చేసుకునే పనిలో ఉన్నారనే చర్చ నడుస్తోంది.

కూలీలతో వార్డు పర్యటనలు

- తెలుగుదేశం అభ్యర్థి టీజీ భరత్ రోడ్‌షోలు, వార్డు పర్యటనలు చేస్తున్నప్పటికీ ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడం లేదనే అభిప్రాయం పార్టీ కేడర్‌లోనే నెలకొంది.
- టీజీ వెంకటేష్ పోటీ చేసినప్పుడు కార్యకర్తల సమీకరణ పోటీ పడి చేసేవారని, టీజీ భరత్‌కు ఆ పరిస్థితి కనిపించడం లేదని, అభ్యర్థి వెంట వార్డు పర్యటనలో పాల్గొంటున్న కార్యకర్తలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.
- ర్యాలీతో పాటు వార్డుల్లో బలాన్ని ప్రదర్శించేందుకు రోజూవారీ కూలీలకు వినియోగిస్తున్నట్లు వినికిడి.
- ప్రచారం అనంతరం కూలీతో పాటు భోజనం, మద్యం వంటివి కూడా సమకూరుస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ప్రచారంలో చుక్కెదురు

ఇంటింటి ప్రచారంలో కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌కు చేదు అనుభవం ఎదురైంది. శుక్రవారం మైనార్టీలు అధికంగా ఉండే 10వ వార్డులోని గుమ్మజ్ ప్రాంతంలో పర్యటించారు. అయితే ఓటర్ల నుంచి స్పందన లభించకపోగా చాలామంది మహిళలు ఆయన రాకను గమనించి తలుపులు మూసుకోవడంతో స్థానిక టీడీపీ నాయకులపై టీజీ భరత్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఊగిపోయినట్లు సమాచారం. కేవలం ఒక వీధిలో పర్యటించి ప్రచారం ముగించుకుని వెళ్లిపోవడంతో టీజీ భరత్ వెంట ఉన్న కార్యకర్తలు అయోమయానికి లోనయ్యారు.

నామినేషన్ల ఉపసంహరణ నిల్

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉండేందుకు జిల్లాలో 132 మంది అభ్యర్థులు నామినేషన్లను వేశారు. వీరిలో ఏదైనా కారణంతో నామినేషన్ల ఉపసంహరణకు శని, సోమ వారాల్లో అవకాశం ఉంది. అయితే శనివారం ఏ ఒక్కరూ తమ నామినేషన్లను వెనక్కి తీసుకోలేదు. కర్నూలు పార్లమెంట్‌లో 20 మంది, కర్నూలు అసెంబ్లీలో 27 మంది, పాణ్యంలో 14మంది, పత్తికొండలో 11 మంది, కోడుమూరులో 16 మంది,ఎమ్మిగనూరులో 10 మంది, మంత్రాలయం 10, ఆదోని 11,ఆలూరులో 13 మంది పోటీలో ఉన్నారు.

నిప్పుల గుండం



కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రతకు ఉమ్మడి జిల్లా నిప్పుల గుండంగా మారుతోంది. ఎండలు, వడగాడ్పుల తీవ్రత గరిష్ట స్థాయికి చేరుతున్నాయి. నంద్యాల జిల్లాలో ఎండల తీవ్రత మరింత ఆందోళనకరంగా ఉంటోంది. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 8 మండలాల్లో 44 డిగ్రీలకుపైగా నమోదు కావడం గమనార్హం. కర్నూలు జిల్లాలో 4 మండలాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు, వడగాడ్పుల తీవ్రతకు కర్నూలు, నంద్యాల జిల్లాలు విలవిల్లాడుతున్నాయి. చాగలమర్రిలో 45.9, డోన్‌లో 45.8, బనగానపల్లిలో 45.8, మహానందిలో 45.3, ఆళ్లగడ్డలో 45, గడివేములలో 45 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోడుమూరులో 44.8, కొత్తపల్లిలో 44.6, ఆత్మకూరులో 44.6, బండిఆత్మకూరులో 44.6, కర్నూలులో 44.5, రుద్రవరంలో 44.5, పాణ్యంలో 44.4, కల్లూరులో 44.3, గూడూరులో 44.2, కొలిమిగుండ్లలో 44.2, నందకొట్కూరులో 44.2, సంజామలలో 44 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఈ నెల చివరి వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం



మేనిఫెస్టో ప్రతులను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, పార్టీ నేతలు

- అన్ని వర్గాలకు మరింత మేలు చేసే విధంగా మేనిఫెస్టో
- విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్
- ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయిన టీడీపీ అధినేత చంద్రబాబు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, పార్టీ నేతలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన మేనిఫెస్టోను అన్ని వర్గాల ప్రజలకు మరింత మేలు చేసే విధంగా ఉందన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్‌జగన్ నెరవేర్చారన్నారు. ఐదేళ్ల పాటు ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ అందించి విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. సీఎం జగన్‌ను ఎదుర్కోలేక అన్ని పార్టీలను కలుపుకొని కూటమిగా వస్తున్న చంద్రబాబు ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయారన్నారు. సూపర్ -6 పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో హర్షం వ్యక్తమవుతోందన్నారు. 'మీకు లబ్ధి చేకూరి ఉంటేనే ఓటు వేయండని చెప్పిన' దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఐదేళ్ల పాటు చేసిన మంచిని, మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకుపోదామన్నారు. పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రకటించిన మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. పార్టీ కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రతి పథకాన్ని కొనసాగిస్తూ.. మరి కొన్నింటికి లబ్ధి మొత్తం పెంచడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. చంద్రబాబు వస్తే వర్షాలు రావని, కరువు తప్పదన్నారు. కర్నూలులో కొండారెడ్డి బురుజు ఎంత భద్రంగా ఉందో జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అంత బలంగా ఉందన్నారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ఇస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని విమర్శలు చేసిన చంద్రబాబు జగనన్న ప్రభుత్వం కన్నా రెండింతలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నేతలు మేనిఫెస్టో ప్రతులను విడుదల చేశారు. పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, ఏపీ ఐడీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యం యాదవ్, పార్టీ నాయకుడు గడ్డం రామక్రిష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జనరల్ అబ్జర్వర్లు మీర్ తారిఖ్ అలీ, జాఫర్ సమక్షంలో ర్యాండమైజేషన్‌గా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు సిబ్బందిని కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి 120 శాతం బఫర్‌తో సిబ్బందిని కేటాయించామన్నారు. ర్యాండమైజేషన్‌గా పోలింగ్ సిబ్బంది అపాయిన్‌మెంట్ ఆర్డర్ ఇచ్చామని, వీరికి శిక్షణ కూడా ఇచ్చినట్లు చెప్పారు. రెండో విడత శిక్షణ పూర్తి చేసుకున్న వారిని ర్యాండమైజేషన్‌గా అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లను ఓపీఓలుగా నియమిస్తూ రిజర్వ్‌లో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జి.కృష్ణకాంత్, రిటర్నింగ్ ఆఫీసర్లు నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివనారాయణ్ శర్మ, ఎం.శేషిరెడ్డి, ఎస్.రామలక్ష్మి, చిరంజీవి, మురళి, రామునాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో కె.మధుసూదన్ రావు, జిల్లాఖ జానా అధికారి రామచంద్రారావు, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దీప్తి పాల్గొన్నారు.

ఓటు విలువ తెలియజేస్తే బహుమతి

కర్నూలు(సెంట్రల్): ఓటు విలువను తెలియజేస్తూ 30 సెకండ్ల వీడియో చేసి ప్రైజ్ గెలుచుకునే అవకాశాన్ని జిల్లా ఎన్నికల సంఘం కొత్త ఓటర్లకు అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీడియోలను జిల్లా స్వీప్ నోడల్ అధికారి మెయిల్ kurnoolsveepnodalofficer@gmail.comకు మే 6వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు పంపాలని సూచించారు. అయితే ఈ వీడియోను పంపేందుకు మొదటి సారి ఓటు వేసే వారు మాత్రమే అర్హులని గుర్తించాలని పేర్కొన్నారు.

ఓటింగ్ రోజు కార్మికులకు సెలవు

కర్నూలు(సెంట్రల్): కార్మికులకు ఓటింగ్ రోజు మే 13వ తేదీన సెలవు ఇచ్చినట్లు కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు అని ఇంటి వద్ద ఉండకుండా కార్మికులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్‌ను గుర్తించడానికి ఓటర్లు 1950 కాల్ సెంటర్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని చూపి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి రేపు కౌన్సెలింగ్

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఈనెల 29వ తేదీన 1.3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు సమీపంలోని దిన్నెదేవరపాడు గురుకుల పాఠశాలలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు మెరిట్ జాబితాలో ఉన్న వారు హాజరు కావాలన్నారు. విద్యార్థులు మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో హాజరు కావాలన్నారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. https://apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో మార్కులు తెలుసుకోవచ్చునన్నారు. ఇంటర్ ఫలితాలు జిల్లా వ్యాప్తంగా 5,777 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,445 మంది ఉత్తీర్ణత సాధించారు. పదవ తరగతిలో 1,404 మంది విద్యార్థులకు గాను 209 మంది ఉత్తీర్ణత సాధించారు. ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో తప్పిన విద్యార్థుల కోసం జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 29 నుంచి మే 4వ తేదీ వరకు చెల్లించవచ్చు. అపరాధ రుసుంతో మే 5 నుంచి 8వ తేదీ వరకు, తత్కాల్ విధానంలో మే 9, 10 తేదీల్లో పరీక్ష ఫీజును చెల్లించేందుకు గడువు ఇచ్చారు.

గేమ్ చేంజర్

సకల జనుల సంక్షేమం



పాదయాత్రలో పేదల కన్నీటిసెగ గుండెను తాకింది...రైతు భరోసా యాత్రలో రైతుల ఆక్రందన మనసును కలిచివేసింది....జబ్బుచేస్తే చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కన్నీరు తెప్పించాయి.. పాదయాత్రలో ప్రతీ పల్లెలో ప్రతీ గుండెచప్పుడు విన్నారు.. ప్రతీ ఆక్రందన ఆలకించారు. రాజు, పేద బతుకులో తేడాను కళ్లారా చూశారు. అందుకే తనని నమ్మి పాలన ఇచ్చిన ప్రజలకు 'నవరత్నాల'తో ఐదేళ్లు బంగారు జీవితం ఇచ్చారు. ఇప్పుడు రెండు అడుగులు ముందుకేసి వాటికి మరింత వన్నె తెచ్చి సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా, పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోను రూపొందించారు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికలకు 15 రోజుల ముందు ఐదేళ్ల పాలన ఎలా ఉండబోతోందో వివరించారు. చేసేదే చెప్పాను.. చెప్పింది చేస్తాను అని తన ప్రజలకు మనసులోని మాటను నిర్భయంగా చెప్పి విశ్లేషకులతో పాటు అన్ని వర్గాల నుంచి 'భేష్' అనిపించుకున్నారు.

– సాక్షి బృందం

జగనన్న 'బాండ్' ఫెస్టో ఇది



ఇది వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కాదు జగనన్న 'బాండ్' ఫెస్టో. జగనన్న మాట ఇచ్చారు అంటే అది 'బాండ్ పేపర్'తో సమానం. వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ, 108, 104, ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా విప్లవాత్మకమైన అభివృద్ధిని చేసి చూపించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చారు. కోవిడ్ సమయంలో దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలను కన్నబిడ్డల వలే కాపాడుకున్నాడు. ఇలాంటి నాయకుడు విడుదల చేసే మేనిఫెస్టో పట్ల ప్రజలు పూర్తి నమ్మకంతో ఉన్నారు. –నీలారెడ్డి, ప్రైవేటు హాస్పిటల్ ఉద్యోగి, కర్నూలు

రైతు పక్షపాతి జగన్



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందించారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా పథకం కింద ఏటా ఇచ్చే రూ.13,500ను రూ.16 వేలకు పెంచడం సంతోషంగా ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, సబ్సిడీ విత్తనాలతో లబ్ధి పొందేందుకు అవకాశం కల్పించేలా మేనిఫెస్టో విడుదల చేయడం హర్షణీయం. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకుంటాం.

– పూజారి చిన్న ఈరన్న, పెద్దతుంబళం, ఆదోని మండలం

చాలా సంతోషం



నాకు భర్త లేరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదటిసారిగా నేను వితంతు పింఛన్ పొందాను. ఆ పింఛన్ డబ్బులే నాకు ఆసరాగా ఉన్నాయి. ప్రతినెలా పింఛన్ అందుతోంది. సీఎం వైఎస్ జగన్‌ను నా పెద్దకొడుకులా భావిస్తున్నా. ఎన్నికల్లో గెలిస్తే రూ.3500 పింఛన్ అందిస్తానని మేనిఫెస్టోలో ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. మంచి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు అన్ని వేళలా ఉంటాయి. – సంజమ్మ, హాలహర్వి

లారీ డ్రైవర్లను గుర్తించారు



గతంలో ఏ ప్రభుత్వం కూడా లారీ డ్రైవర్లను గుర్తించలేదు. సీఎం వైఎస్ జగన్ మమ్మల్ని గుర్తించారు. ఏటా రూ.10వేలు ఇవ్వడంతో పాటు రూ.10 లక్షల వైఎస్సార్ బీమా సౌకర్యం కల్పిస్తూ మేనిఫెస్టోలో ప్రకటించారు. లారీ డ్రైవర్ వృత్తి చాలా ప్రమాదకరమైనది. గతంలో డ్రైవర్లు మృతి చెందితే వాళ్ల కుటుంబాలను పట్టించుకునే వారు లేరు. సీఎం జగన్ భరోసా కల్పించడం చాలా సంతోషకంగా ఉంది.

– రంగన్న, లారీ డ్రైవర్, కోసిగి

చెబితే కచ్చితంగా చేస్తారు



సీఎం వైఎస్ జగన్ చెబితే తప్పకుండా చేస్తారు. పేద విద్యార్థులు డబ్బుల లేని కారణంగా చదువుకు దూరం కాకూడదని అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు మళ్లీ అమ్మఒడి పథకాన్ని రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచుతామని చెప్పారు. చంద్రబాబు అబద్ధాల హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తారు. ఆయనను ఎవరూ నమ్మరు. – బగిలి రజియా, గోనెగండ్ల

అన్ని వర్గాలకు న్యాయం



సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ఉంది. గతంలో కంటే బాగుంది. మాకు ముగ్గురు పిల్లలు.. ఇద్దరు ప్రభుత్వం అందించే ఫీజురీయింబర్స్‌మెంటతో బీటెక్ కోర్సు పూర్తి చేశారు. ఒక అబ్బాయి పదో తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పథకం మాకు ఉపయోగపడింది. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల కింద లబ్ధి పొందాం. ఇంతకంటే మాకు ఏమి కావాలి. – రమేష్, మద్దికెర

జగన్‌పై నమ్మకం ఉంది



సీఎం వైఎస్ జగన్ పేదల కోసం ఎంతో చేశారు. ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దనే అందించారు. వలంటీర్ల ద్వారా మాకు పింఛన్‌తో సహా ఇతర పథకాలు అందాయి. సీఎం జగన్ చెప్పారంటే తప్పకుండా చేస్తారు. జగన్ చెప్పిన పథకాలపై, ఆయన మాటలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.

– చాకలి సుంకులమ్మ, సి.బెళగల్

క్లుప్తంగా

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల గిరిజన గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంలోని బాలుర కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ గ్రూపులకు నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప, గుంటూరుకు చెందిన ఎస్టీ విద్యార్థులకు 40 సీట్లు, అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో 20 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే పాణ్యం మండలం బలపనూరు బాలికల కళాశాలలో కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అనంతపురం, కడప, గుంటూరు జిల్లాలకు చెందిన ఎస్టీ అభ్యర్థులకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో 60 సీట్లు, అకౌంట్స్ అండ్ టాక్సేషన్‌లో కేవలం కర్నూలు జిల్లాకు చెందిన ఎస్టీ బాలికలకు 20 సీట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాలలో మొదటి ప్రాధాన్యత చెంచు అభ్యర్థులకు ఉంటుందని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఓసీ, బీసీ, ఎస్సీ ఏజెన్సీ ఉద్యోగుల పిల్లలకు ఒక్కోసీటు చొప్పున కేటాయించినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులను www. aptwrgurukulam. ap. gov లో సమర్పించాలని, దరఖాస్తు చివరి తేదీ మే 15 అని, ఇతర వివరాలకు శ్రీశైలం ప్రిన్సిపాల్ 9490957268, 9494454357, 970112491 9, బలపనూరు ప్రిన్సిపాల్ 9490957266, 9515702407, 9493782467లకు సంప్రదించాలని పీఓ తెలిపారు.

నేడు ఏపీసెట్


పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ ఎన్‌టికె నాయక్, ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు

కర్నూలు కల్చరల్: విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల అర్హత పరీక్ష ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీసెట్) –2024ను ఆదివారం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఏపీసెట్ రీజినల్ కో ఆర్డినేటర్, రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్, స్పెషల్ అబ్జర్వర్, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొత్తం 3,883 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల, కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల ఎ,బి సెంటర్‌లు, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాల, నందికొట్కూరు రోడ్ సెయింట్ జోసెఫ్స్ మహిళా కళాశాలలో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు నిర్దేశించిన సమయం కంటే గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక అబ్జర్వర్‌ను నియమించామన్నారు.

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి

డోన్ రూరల్: వెంకటాపురం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. రూరల్ సీఐ అస్రత్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండలం ఎంజే.తండా గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ (47) శనివారం డోన్‌లో నిర్వహించే సంతకు వచ్చాడు. సంత చూసుకొని బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్ర'జల' కష్టాలు తీరేలా..



తుగ్గలి మండలం చిన్న జొన్నగిరి గ్రామంలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు, ఆస్పరి మండలం తొగలగల్లు గ్రామంలో ..

● ట్యాంకర్లతో నీటి సరఫరా

కర్నూలు(అర్బన్): వేసవిలో పల్లె ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను చేపట్టింది. గత ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా కురవడం, అలాగే రోజు రోజుకు ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాల్చుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే ఉత్పన్నమైన తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సమీపంలోని వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని ట్యాంకర్ల ద్వారా గ్రామ ప్రజల అవసరాల మేరకు నీటిని అందిస్తున్నారు. వేసవి ప్రారంభం కాక ముందే గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా గ్రామ ప్రజల జనాభా, నీటి అవసరాలపై వాటర్ ఆడిట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ నెలలో 55 గ్రామాలు, మే నెలలో 112, జూన్‌లో 128 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుందనే అంచనాకు వచ్చారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంపిన నివేదికలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ద్వారా ఎంపీడీఓ, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు పంపారు. జిల్లా కలెక్టర్ పంపిన నివేదికలపై ఆయా నెలల్లో ఆయా ప్రాంతాల్లో ఉత్పన్నమయే నీటి సమస్యను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఈ మేరకు ప్రస్తుతం తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న 12 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరాలో ఎక్కడా అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ యాప్ ద్వారా ట్రిప్పులను లెక్కగడుతున్నారు. ఆయా గ్రామాల్లో జనాభాను బట్టి మూడు నుంచి నాలుగు ట్రిప్పులను ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందుకు 5 కిలోమీటర్ల దూరానికి ఒక ట్రిప్పుకు రూ.567, 10 కిలోమీటర్లకు రూ.718, 15 కిలోమీటర్లకు రూ.869లను చెల్లించనున్నారు. అలాగే జూన్ నెల వరకు నీటి ఎద్దడి తలెత్తనున్న గ్రామాల ప్రజలకు నీటిని అందించేందుకు ఇప్పటికే రూ.12 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా అవుతున్న గ్రామాలు

ఆస్పరి మండలం పుప్పాలదొడ్డి, తొగలగల్లు, మంత్రాలయం మండలం చెట్నేహళ్లి, తుగ్గలి మండలం దేశాయితాండా, వాగుల గుడిసెలు, చిన్న జొన్నగిరి, ఓర్వకల్ మండలం శకునాల, తిప్పాయిపల్లి, చెన్నంశెట్టిపల్లి, వెంకటాపురం, సోమయాజులపల్లె, వెల్దుర్తి మండలం గువ్వలకుంట్ల గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

దేవుడి సొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండాలి

● రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

కడప కల్చరల్: దేవునిసొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండేలా సంబంధిత అధికారులంతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. రాయలసీమ జోన్ దేవదాయశాఖ ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగుల విస్తృత స్థాయి సమావేశం శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు తమ పరిధిలోని 6ఏ–బి తదితర దేవాలయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఆలయాల ఆస్తులు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలు, పబ్లికేషన్, దేవునికి సంబంధించిన నగలు, ఇతర ఆస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విషయాలను సంబంధిత ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ కమిషనర్ల వద్ద సమాచారం ఉండేలా చూసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ పై అధికారులకు చేర్చాలన్నారు.

● బొలేరో మినీ ట్రక్కు సీజ్..వ్యక్తి అరెస్ట్

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్న రూ.4.84 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు జిల్లా సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం తెల్లవారు జామున 5 గంటలకు ఆస్పరి మండలం తొగలగల్లు, యాటకల్లు గ్రామాలకు వెళ్లే బండి రస్తాలో సెబ్ డివిజనల్ టాస్క్ ఫోర్స్ టీం వాహన తనిఖీలు చేపట్టిందన్నారు. తనిఖీల్లో బొలెరో మినీ ట్రక్కులో తరలిస్తున్న 80 బాక్సులు కర్ణాటక మద్యం (7,680 టెట్రా ప్యాకెట్లు) గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. బొలెరో వాహనంతో పాటు హొళగుంద మండల కేంద్రానికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. హొళగుందకు చెందిన వాహన డ్రైవర్ తౌసీఫ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.4.84 లక్షలు, సీజ్ చేసిన వాహనం విలువ రూ.9 లక్షలు ఉందన్నారు. పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని యాటకల్లు గ్రామానికి చెందిన బోయ రామాంజినేయులుకు 50 బాక్సులు, తొగలగల్లు గ్రామానికి చెందిన నరసన్నకు 30 బాక్సులు మద్యం సరఫరా చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. డ్రైవర్ తౌసీఫ్‌తో పాటు రామాంజినేయులు, నరసన్నను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ వీరస్వామి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'సీమ' ఓపెన్ టెన్నిస్ టోర్నీ


విజేతలకు ట్రోఫీ, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసిన డాక్టర్ జి.సృజన

● విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ బహూకరించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (టౌన్): నగర శివారులోని జొహరాపురం నెట్ నట్స్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రేటర్ రాయలసీమ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ శనివారం రాత్రి ముగిసింది. అండర్–8, అండర్–10, అండర్–12 విభాగాల్లో బాలబాలికలకు టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో అండర్–8 విభాగంలో విజేతగా యశోద (గిద్దలూరు), రన్నర్‌గా వేదు (కర్నూలు), అండర్–10 విభాగంలో విజేతగా రామ్‌ధీరజ్ (కర్నూలు), రన్నర్‌గా పార్థు (కర్నూలు) నిలిచారు. అండర్–12 బాలికల విభాగంలో విజేతగా భావన (కర్నూలు), రన్నర్‌గా సమృద్ధి (కర్నూలు) నిలిచారు. విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ట్రోఫీలు, మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో నెట్ నట్స్ టెన్నిస్ అకాడమీ కోచ్ ఉపేందర్, అడ్మిన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

కర్ణాటక మద్యం తరలిస్తూ ముగ్గురు అరెస్ట్

నందవరం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కనకవీడు గ్రామానికి చెందిన బోయ చంద్రబాబు నాయుడు, బోయ రాజు, బోయ వెంకటేష్‌లు కర్ణాటక మద్యాన్ని బైక్‌పై తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి 1,248 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

● బూత్ ఇన్‌చార్జ్ నియామకంపై ఘర్షణ
● కుర్చీలతో కొట్టుకున్న టీడీపీ నేతలు
● ధర్మారం సుబ్బారెడ్డి సోదరుడు చిన్న నాగిరెడ్డితో పాటు మరో ఇద్దరికి గాయాలు



ప్యాపిలి/డోన్: సార్వత్రిక ఎన్నికల వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు భయపడినట్లే జరిగింది.. 50 ఏళ్లకు పాగా ఫ్యాక్షన్ రాజకీయాలు నడిపి పరస్పరం కత్తులు దూసుకున్న కోట్ల, కేఈ వర్గాలు ఈ ఎన్నికల్లో ఒక్కటి కావడమే డోన్ ప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒకటే ఒరలో రెండు కత్తులు ఇమడమే కష్టమైతే మూ డో కత్తి ఆ ఒరలో ఎలా ఇముడుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. కలగూర గంపలా తయారైన టీడీపీ వర్గీయులు పార్టీలో తమ ఆధిపత్యం కోసం తరచుగా ఘర్షణలకు దిగుతూ ప్రజలను భయాందోళన కు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్యాపిలి పట్టణంలో జరిగిన బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశం కేఈ వర్గీయులైన టీడీపీ బీసీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, ప్యాపిలి మాజీ ఎంపీపీ తొప్పెల శ్రీనివాసు లు, నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి వర్గీయులు రసాభాసాగా మార్చారు. పెద్దపొదిళ్లకు చెందిన ప్రసాద్‌రెడ్డి పేరును బూత్ ఇన్‌చార్జ్‌గా ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాగేశ్వరరావు, తొప్పెల శ్రీనివాసులు వర్గీయులు ప్రసాద్‌రెడ్డిని పార్టీ కార్యక్రమాల్లో కలుపుకుని పోయేది లేదని తేల్చి చెప్పినట్లు తెలిసింది. దీంతో చిల్లర రాజకీయాలు చేయవద్దని నాగిరెడ్డి వారిపైకి మైక్ విసిరారు. కోట్లకు ప్రధాన అనుచరుడు లక్కసాగరం లక్ష్మీరెడ్డి ఎదుటే పరస్పరం అసభ్య పదజాలంతో దూషించుకుంటూ మైకు, కుర్చీలతో పరస్పరం దాడులకు పాల్పడినట్లు తెలిసింది. ఒక దశలో కేఈ వర్గీయుడైన మాజీ ఎంపీపీ తొప్పెల శ్రీనివాసులు టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి సోదరుడు చిన్ననాగిరెడ్డిపై చేయి చేసుకోవడంతో పాటు కుర్చీతో దాడి చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఘర్షణను నివారించబోయిన పెద్దపొదిళ్ల ఓబులేసు, చంద్రపల్లి టీడీపీ కార్యకర్త నాగేశ్వరరావుతో పాటు చిన్ననాగిరెడ్డికి గాయాలైనట్లు తెలిసింది. కలగూర గంపలా మారిన టీడీపీలోని మూడు వర్గాల నుంచి ప్రశాంతంగా ఉన్న ప్యాపిలి పట్టణంలో శాంతిభద్రతలకు పూర్తిగా విఘాతం కలిగే పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

డోన్‌లో ప్రతీకార దాడి..

ప్యాపిలిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోదరుడు ధర్మారం చిన్ననాగిరెడ్డిపై జరిగిన దాడికి డోన్‌లో ప్రతిదాడికి యత్నించారు. నాగేశ్వరరావు యాదవ్ సోదరుడు రైతుమిత్ర నగర్‌లో నివసిస్తున్న లక్ష్మీనారాయణ యాదవ్ ఇంటిపై సుబ్బారెడ్డి వర్గీయులు శనివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిని ముందే గ్రహించిన లక్ష్మీనారాయణ కారులో ఇంటి నుంచి పరారయ్యాడు. ఇరువర్గాల మధ్య జరగుతున్న వరుస సంఘటనలతో ఆ పార్టీ కార్యాలయం వద్దకు వెళ్లేందుకు టీడీపీ కార్యకర్తలు జంకుతున్నారు.

విధులకు వెళ్తూ తిరిగిరాని లోకాలకు..


మృతిచెందిన శేఖర్

కోడుమూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో కోడుమూరుకు చెందిన శేఖర్(47)అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కోడుమూరులో చోటు చేసుకుంది. కోడుమూరులోని కల్లుపెంటవీధికి చెందిన శేఖర్ గూడూరులోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు లాగానే పెట్రోల్ బంకులో విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై శనివారం బయలుదేరగా, కర్నూలు నుంచి కోడుమూరు వైపు వేగంగా వస్తున్న బొలేరో వాహనం అదుపు తప్పి ముందు వెళుతున్న పోతుగల్లు వీఆర్వో వెంకటేష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో పాటు, శేఖర్ ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా, వీఆర్వో వెంకటేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కాగా బొలేరో వాహనం డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమా దం జరిగినట్లు కోడుమూరు పోలీసులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన వెంటనే బొలేరో వాహ నం డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మృతిచెందిన శేఖర్‌కు భార్య వాణితో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం


నగళ్లపాడు వద్ద కారులో ఇరుక్కొని మృతి చెందిన చక్రపాణి

చాగలమర్రి: నగళ్లపాడు గ్రామ సమీపంలోని భవనాసివాగులో కారు పడి నుజ్జునుజ్జయిన ఘటనలో చక్రపాణి (20) అనే ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రామ్మోహన్, సుజాత దంపతుల ఏకైక కుమారుడు గండికోట చక్రపాణి (20) పట్టణంలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా కళాశాలకు సెలవులు వచ్చినపుడు కారు డ్రైవర్‌గా వెళ్లేవాడు. ప్రస్తుతం సెలవులు ఇవ్వడంతో ప్రొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డకు బాడుగకు వెళ్లి తిరిగి వెళ్తుండగా నగళ్లపాడు సమీపంలో కారు వేగం అదుపు కాక డివైడర్‌ను ఢీ కొట్టి భవనాసి వాగులోకి ఎగిరి పడింది. డ్రైవింగ్ చేస్తున్న చక్రపాణి కారులోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్, ఎస్ఐ రమయ్య టోల్ ప్లాజా సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని కారును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అందులో నుంచి సుమారు గంట సేపు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీవాణి (30) మృత్యువాత పడింది. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన శ్రీవాణి భర్త కృష్ణారెడ్డితో కలిసి పట్టణంలో జరుగుతున్న ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలు దేరారు. పట్టణ శివారులోని ఏపీ గోడౌన్ల సమీపంలోని అంతర్గత రోడ్డు నుంచి హైవే పైకి వెళ్లేసరికి వెనుక వైపు నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీ కొట్టింది. దీంతో శ్రీవాణి అక్కడిక్కడే మృతి చెందగా భర్త కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తీసుకెళ్లారని సీఐ రమేష్‌బాబు తెలిపారు.